ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

7 విశాఖపట్నం

జిల్లా వార్తలు

గురువారం 15 ఆగస్టు 2024



సీపీ శంఖబ్రతబాగ్చికి ప్రెసిడెంట్ పోలీస్ మెడల్



విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి ప్రతిష్ఠాత్మకమైన ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ (పీపీఎం)ను గురువారం ప్రదానం చేయనున్నారు. ఆయన్ను పీపీఎంకు గత ఏడాది ఆగస్టు (అప్పుడు రాష్ట్ర శాంతిభద్రతల విభాగం అదనపు డీజీగా పనిచేస్తున్నారు)లో రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. గురువారం విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో జరిగే స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులు మీదుగా శంఖబ్రతబాగ్చి మెడల్ అందుకోనున్నారు.

ట్రాఫిక్ కంట్రోల్‌కు ఏఐ

జంక్షన్లలో ఏఎన్‌పీఆర్ కెమెరాలు

- వాహనాల సంఖ్యను అనుసరించి ఆటోమేటిక్‌గా సిగ్నలింగ్ సమయం మార్పు
- తొలుత రెండు జంక్షన్‌లలో పరిశీలన
- మలి దశలో సిగ్నళ్ల సింక్రనైజేషన్
- ట్రాఫిక్ పర్యవేక్షణతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారికి టెక్నాలజీ ఆధారంగానే చలానాలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగర ప్రజలు ట్రాఫిక్ వలయంలో చిక్కుకోకుండా సజావుగా ప్రయాణం సాగించడానికి పోలీస్ యంత్రాంగం చర్యలు చేపడుతోంది. దీనికి అధునాతన టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను ఉపయోగించుకోనుంది.

అమరావతిలో ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు సమక్షంలో జరిగిన సమావేశంలో విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ఏఐను వినియోగిస్తామని డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. ఇది జరిగిన నాలుగు రోజులకే విశాఖపట్నంలో కలెక్టర్ హరీంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీలు ఏఐ టెక్నాలజీ అందించే పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. వారు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను చూశారు. ట్రాఫిక్‌ను అవసరమైనప్పుడు ఆటోమేటిక్‌గా మళ్లించడానికి అవకాశాలు ఏమి అందుబాటులో ఉన్నాయో తెలుసుకున్నారు. మొత్తం మూడు కంపెనీలు రాగా తొలుత రెండు ప్రధాన జంక్షన్లలో ప్రయోగాత్మకంగా అమలు చేసి ఫలితాలను బట్టి పూర్తిస్థాయిలో అమలు చేయాలని నిర్ణయించారు.

ఏమి చేస్తారంటే...?

ఎంపిక చేసిన జంక్షన్లలో ఆటో నంబరు ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) టెక్నాలజీ కలిగిన కెమెరాలు అమరుస్తారు. వాటికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ జోడిస్తారు. అవి...ఆ జంక్షన్‌లో ఎటు వైపు నుంచి ఎక్కువ వాహనాలు వస్తున్నాయో, వాటి సంఖ్య ఎంత ఉందో అంచనా వేస్తాయి? ఏ వైపునకు ఎక్కువ వాహనాలు వెళుతున్నాయో గమనిస్తాయి. వీటన్నింటినీ కాలిక్యులేట్ చేసుకొని సిగ్నలింగ్ సమయాన్ని ఆటోమేటిక్‌గా మార్చుకుంటాయి. ఇప్పుడు ప్రతి సిగ్నల్ ముందుగా ఫిక్స్ చేసిన సమయం ప్రకారం పనిచేస్తున్నాయి. ఏఐ టెక్నాలజీ అలా కాకుండా ఒక వైపు ఎక్కువ వాహనాలు వస్తున్నాయని గుర్తిస్తే...ఆ వైపు గ్రీన్‌సిగ్నల్ ఎక్కువసేపు వెలుగుతుంది. వాటికి క్లియరెన్స్ లభిస్తుంది. తక్కువ వాహనాలు ఉన్నాయని గుర్తించిన వైపు వెంటనే రెడ్ సిగ్నల్ వేస్తుంది. దీనివల్ల వాహనాలు లేని మార్గంలో గ్రీన్ లైట్ వెంటనే ఆగిపోతుంది. ఇలా వాహనాల ట్రాఫిక్‌ను బట్టి ఎప్పటికప్పుడు సర్దుబాటు చేసుకుంటుంది. మలి దశలో ఈ సిగ్నల్స్‌ను ఇతర జంక్షన్ల సిగ్నళ్లతో సింక్రనైజేషన్ చేస్తారు. జాతీయ రహదారిపై అనుమతించిన వేగంతో నడిచే వాహనాలు ఒక జంక్షన్ వద్ద గ్రీన్ లైట్‌ని దాటితే...మిగిలిన జంక్షన్లలో అదే వేగంతో వెళ్లిపోయే అవకాశం ఉంటుంది. ఎక్కువ, తక్కువ వేగంతో నడిచే వాహనాలకు ఈ వెసులుబాటు ఉండదని ఓ పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు.

ఆటోమేటిక్ చలానాలు

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఇప్పుడు మాన్యువల్‌గా చలానాలు జారీ చేస్తున్నారు. అంటే హెల్మెట్ లేకపోతే ఫొటోలు తీసి అప్‌లోడ్ చేశాక జరిమానా చలానా జనరేట్ అవుతోంది. అలాగే ... మిగతా 8వ పేజీలో

ఎమ్మెల్సీగా బొత్స ఎన్నిక లాంఛనం

అధికారికంగా ప్రకటన రేపు

- నామినేషన్ ఉపసంహరించుకున్న స్వతంత్ర అభ్యర్థి
- రేపు సాయంత్రం 3 గంటల నుంచి కోడ్ ఎత్తివేత



బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) స్థానానికి వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సమక్షంలో నామినేషన్లు పరిశీలించారు. నామినేషన్ల పరిశీలన కార్యక్రమానికి స్వతంత్ర్య అభ్యర్థి షేక్ షఫీ, వైసీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ తరపున ఆయన ప్రతినిధులు హాజరయ్యారు. అన్ని పత్రాలు ఉండడంతో రెండు నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు గడువు ఉంది. అయితే స్వతంత్ర్య అభ్యర్థి షేక్ షఫీ తాను నామినేషన్ ఉపసంహరించుకున్నట్టు బుధవారమే పత్రాలు దాఖలు చేశారు. దీంతో వైసీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ఒక్కరే బరిలో ఉన్నట్టు అయ్యింది. అయినప్పటికీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల తరువాతే అధికారికంగా బొత్స సత్యనారాయణ ఎన్నికను ప్రకటిస్తారు. కాగా ఎన్నిక ఏకగ్రీవం కావడంతో ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల తరువాత కోడ్ తొలగిపోనున్నది. ఈ విషయాన్ని రిటర్నింగ్ అధికారి మయూర్ అశోక్ వెల్లడించారు. కాగా, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని కూటమి నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే.

పోరాటాల పురిటి గడ్డ

- తీరంలో ఇప్పటికీ చెరిగిపోని గురుతులు
- ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన, క్విట్ ఇండియా ఉద్యమాలకు మద్దతు
- మన్యం వీరుడు అల్లూరి విప్లవానికి నాంది

జిల్లాలో ఎగసిపడిన స్వాతంత్ర్యోద్యమం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్వాతంత్ర్య సంగ్రామంలో ఉమ్మడి విశాఖ జిల్లా తనదైన ముద్రను వేసింది. ఇక్కడ జరిగిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. దేశంలోనే తొలి సిపాయిల తిరుగుబాటు విశాఖ నగరంలోనే జరిగింది. ఈ పోరాటాల్లో అత్యంత కీలకమైనది అల్లూరి సీతారామరాజు చేపట్టిన మన్యం తిరుగుబాటు.



ఉద్యమ సభలకు వేదికగా నిలిచిన నగరంలోని టౌన్ హాలు

- 1906లో వందేమాతరం ఉద్యమం సాగింది. ఇందులో భాగంగా ప్రొవెన్షియల్ కాన్ఫరెన్స్ విశాఖ టౌన్‌హాలులో జరిగింది. సమావేశానికి బిపిన్‌చంద్రపాల్, ఎస్.ఎస్. రామస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏవీఎన్ కళాశాల విద్యార్థులు 'వందేమాతరం' నినాదాలు చేయడంతో బుచ్చి సుందరరావు, వడ్డాది నారాయణరావులను కళాశాల యాజమాన్యం సస్పెండ్ చేసింది. ఉద్యమం వేడెక్కుతున్న సమయంలో మారేపల్లి రామచంద్రశాస్త్రి విశాఖలో స్వదేశీ వస్తువుల దుకాణం ప్రారంభించారు.
- 1921లో ఆంధ్ర వైద్య కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు గాంధీ టోపీలు ధరించి తరగతులకు హాజరయ్యారు. దీనిని తీవ్రంగా పరిగణించిన యాజమాన్యాలు 13 మంది వైద్య విద్యార్థులు, మరికొందరు ఇంజనీరింగ్ విద్యార్థులను సస్పెండ్ చేశాయి. దీంతో కొందరు చదువుకు స్వస్తి చెప్పి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు.
- 1930 జనవరి 26న స్వాతంత్ర్యదినంగా పరిగణించి ఉత్సవాలు జరపాలని జాతీయ కాంగ్రెస్ పిలుపునిచ్చింది. విశాఖలో ఉత్సవాల బాధ్యతను రామచంద్రశాస్త్రి, కె.ఎస్.గుప్త చేపట్టారు. విజయనగరంలో ఉత్సవాల బాధ్యతలను తెన్నేటి విశ్వనాథం తీసుకున్నారు. అనకాపల్లిలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో మాడుగులకు చెందిన చినయజ్ఞనారాయణశర్మ, దిమిలి నుంచి ఎం.వి.సత్యనారాయణ, అనకాపల్లివాసి పేర్రాజులు తెల్లదొరలకు వ్యతిరేకంగా ప్రసంగించారు.
- ఉప్పు సత్యాగ్రహాన్ని ఉధృతం చేయడానికి విశాఖ వచ్చిన కొండా వెంకటప్పయ్య తీరంలో సభ నిర్వహించారు. 1930 ఏప్రిల్ 13న టౌన్‌హాలు ... మిగతా 8వ పేజీలో

సిపాయిల తొలి తిరుగుబాటు ఇక్కడే..

1780 అక్టోబరు 3న ముగ్గురు బ్రిటీష్ సైనికులను కాల్చిచంపిన భారతీయ సిపాయిలు

- అనంతరం హైదరాలీకి మద్దతుగా మైసూరు బయలుదేరిన వారిని పట్టుకుని విశాఖపట్నం తీసుకువచ్చి ఉరి తీసిన బ్రిటీషర్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఈస్టిండియా కంపెనీపై 1857లో సిపాయిల తిరుగుబాటు జరిగింది. అదే స్వాతంత్ర్య పోరాటానికి నాంది అని... చరిత్రకారులు పేర్కొంటుంటారు. కానీ, దానికంటే ముందు మూడు పర్యాయాలు సిపాయిలు తిరుగుబాటు చేసినట్టు బ్రిటీష్ పాలకులు అంగీకరించడంతోపాటు వారి గజిట్‌లో ప్రస్తావించారు. వీటిలో మొదటి సిపాయిల తిరుగుబాటు 1780 అక్టోబరు మూడో తేదీన విశాఖ (ప్రస్తుతం క్వీన్ మేరీస్ పాఠశాలకు ఎదురుగా పాత రిజిస్ట్రార్ ఆఫీస్ పరిసరాలు) వద్ద ... మిగతా 8వ పేజీలో

నేడు పరేడ్ గ్రౌండ్‌లో పంద్రాగస్టు వేడుకలు

- జెండా వందనం చేయనున్న మంత్రి అనగాని సత్య ప్రసాద్



వేడుకలకు సిద్ధమైన పోలీస్ బ్యారెక్స్ మైదానం

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కానున్న వేడుకలకు రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన 450 మంది అధికారులు, సిబ్బందికి మంత్రి చేతులు మీదుగా ప్రశంసా పత్రాలను అందించనున్నారు. వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొననున్నారు.

భారీ పతాకం... ఉప్పొంగిన ఉత్సాహం



నగరంలోని సిటీ సెంట్రల్ పార్కు సమీపంలో బుధవారం 25 వేల అడుగుల భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు.

అగ్ని ప్రమాదానికి కారణమేమిటో?

షార్ట్ సర్క్యూట్ కాదని ప్రాథమిక విచారణలో గుర్తింపు?

- పోలీస్, ఫోరెన్సిక్, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖల నుంచి నివేదిక వస్తేనే స్పష్టత

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డులోని సిల్వర్ స్పూన్ రెస్టారెంట్‌ను ఆనుకుని ఉన్న డైనో పార్క్‌లో మంగళవారం సంభవించిన అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం కాదని అగ్నిమాపక శాఖ అధికారులు ప్రాథమికంగా తేల్చినట్టు తెలిసింది. ప్రమాదం జరిగిన స్థలాన్ని అగ్నిమాపక శాఖ అధికారులు కొందరు బుధవారం పరిశీలించారు. ఆ సమయంలో ఒక అధికారి తిరిగి వెళుతూ పక్కనే ఉన్న మరొక అధికారితో 'షార్ట్ సర్క్యూట్ జరిగిన ఆనవాళ్లు కనిపించడం లేదని' అన్నట్టు సమాచారం. ఈ విషయం అగ్నిమాపకశాఖ అధికారి వద్ద ప్రస్తావించగా 'ఆ విషయాలన్నీ మీకెవరు చెప్పారంటూ' ఎదురు ప్రశ్నించడం ఆశ్చర్యానికి గురిచేసింది.

బీచ్‌రోడ్డులో డైనో పార్క్ ఉన్న స్థలం జీవీఎంసీకి చెందిన ఓపెన్‌స్పేస్. అందులో 419 గజాల స్థలాన్ని కొందరు జీవీఎంసీ నుంచి లీజుకు తీసుకుని రెస్టారెంట్, ఐస్‌క్రీమ్ దుకాణంతోపాటు పిల్లల ఎంటర్‌టైన్‌మెంట్ కోసం డైనో పార్క్ ఏర్పాటుచేశారు. లీజుకు తీసుకున్న 419 గజాల స్థలంలో పాటు మరికొంత స్థలాన్ని సిల్వర్ స్పూన్ సంస్థ ఆక్రమించిందనే ఫిర్యాదులు జీవీఎంసీకి ఎప్పటి నుంచో అందుతున్నాయి. కానీ అధికారులు స్పందించిన దాఖలాల్లేవు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో జనసేన పార్టీకి చెందిన ఒక నేత కుటుంబ సభ్యుడు ఆ స్థలాన్ని దక్కించుకోవాలని యత్నిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో డైనో పార్క్‌లో అగ్ని ప్రమాదం జరగడం అనుమానాలకు తావిచ్చింది. కాగా ప్రమాదం గురించి... పోలీసుల వద్ద ప్రస్తావిస్తే అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ, ఎఫ్ఎస్ఎల్ నుంచి నివేదిక వచ్చే వరకూ నిర్దిష్టమైన అభిప్రాయానికి రాలేమని సమాధానం ఇచ్చారు. ఇంత ప్రమాదం జరిగినా జీవీఎంసీ అధికారులు మాత్రం ఆస్థలాన్ని పరిశీలించడంగానీ, లీజు వివరాలను వెల్లడించడం గానీ చేయకపోవడం విశేషం.

డిగ్రీ కళాశాలల రుబాబు

ప్రవేశాల కోసం వెళుతున్న విద్యార్థులపై ఫీజు చెల్లించాలంటూ ఒత్తిడి

- లేనిపక్షంలో అడ్మిషన్ ఇవ్వబోమంటూ బెదిరింపు
- తమకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందని చెప్పినా...పట్టించుకోని వైనం
- ప్రొవిజనల్ అలాట్‌మెంట్ ఆర్డర్‌లో ఫీజును జీరోగా చూపించిన ఉన్నత విద్యా శాఖ
- విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని ఆరోపణ



విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుతం తొలివిడత సీట్ల కేటాయింపును ఉన్నత విద్యా శాఖ పూర్తిచేసింది. సీట్లు వచ్చిన విద్యార్థులు ఈ నెల 16వ తేదీలోగా కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. అయితే ప్రొవిజనల్ అలాట్‌మెంట్ ఆర్డర్స్‌ను పట్టుకుని కళాశాలలకు వెళుతున్న విద్యార్థులకు యాజమాన్యాలు షాక్ ఇస్తున్నాయి. ముందుగా పూర్తి ఫీజు (కొన్ని కాలేజీలు సగం/కొంతైనా)ను చెల్లించాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తిస్తుందని విద్యార్థులు చెబితే...తమకు ఇంకా స్పష్టమైన ఆదేశాలు రాలేదని పేర్కొంటున్నాయి. ఫీజు పూర్తిగా చెల్లిస్తేగానీ అడ్మిషన్ ఇవ్వబోమని కొన్ని కళాశాలలు చెబుతుంటే, మరికొన్ని సగం అయినా చెల్లించాలని కోరుతున్నాయి. దీంతో ఏం చేయాలో తెలియక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు. ప్రైవేటు డిగ్రీ కాలేజీలు కోర్సును బట్టి ఏడాదికి రూ.పది వేల నుంచి రూ.60 వేల వరకు ఫీజు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అయితే విద్యార్థి రూపాయి కూడా కళాశాలలకు చెల్లించాల్సిన అవసరం లేదు. ఉన్నత విద్యా శాఖ ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి విద్యార్థులకు సీట్లు కేటాయిస్తోంది. సీట్లు పొందిన విద్యార్థులకు ప్రొవిజనల్ అలాట్‌మెంట్ ఆర్డర్‌ను అందిస్తోంది. అందులో విద్యార్థి చెల్లించాల్సిన ఫీజుకు సంబంధించిన వివరాల్లో జీరోగా పేర్కొంది. కానీ, ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్రైవేటు కాలేజీలు ఫీజులు వసూలు చేస్తున్నాయి. దీనిపై విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇంచుమించు అన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఇదే విధంగా ఫీజులు వసూలు ... మిగతా 8వ పేజీలో

నేడు రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాక

- 17న తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లతో సమావేశం
- చేతులు మారిన అసైన్డ్ భూముల సందర్శన

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా ఈ నెల 17న జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఆయన గురువారం సాయంత్రం విశాఖ వస్తారు. రాత్రికి ఇక్కడే బస చేసి 16వ తేదీ విజయనగరం వెళతారు. అక్కడ సమీక్ష ముగించుకొని రాత్రికి విశాఖ చేరుకుంటారు. 17న ఉదయం పది గంటలకు కలెక్టరేట్‌లో తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లతో సమావేశం నిర్వహిస్తారు. ప్రభుత్వ భూముల పరిరక్షణపై సూచనలు చేస్తారు. ఆ తరువాత వివిధ మండలాలకు వెళ్లి చేతులు మారిన అసైన్డ్ భూములను పరిశీలిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు భూ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఫిర్యాదు చేయాలనుకునేవారు కలెక్టరేట్‌కు రావాలని డీఆర్వో సూచించారు.

ఉక్కు పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

- 22న సీఎండీ కార్యాలయం ముట్టడి

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోవడానికి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నామని పరిరక్షణ కమిటీ నాయకులు ప్రకటించారు. నగరంలోని ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తొలుత గుర్తింపు యూనియన్ సంఘం నాయకుడు ఆదినారాయణ మాట్లాడుతూ ప్లాంటును ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకూ ఎటువంటి సాయం చేయలేదన్నారు. మరోవైపు ప్లాంటులో ఉత్పత్తి తగ్గించేసి, కార్మికుల సంఖ్యలో కోత వేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్లాంటు మూతపడితే దానిని పునరుద్ధరించడానికి రూ.10 వేల కోట్లు అవసరం అవుతాయని, ఇప్పుడు రూ.5 వేల కోట్ల మూలధన సాయం చేయాల్సిందిగా కోరితే కేంద్రం ముందుకురావడం లేదన్నారు. సీఐటీయూ నాయకులు సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ, ముడి పదార్థాలు సమకూర్చి ఉత్పత్తిని పెంచాలని, పూర్తి సామర్థ్యంతో నడపాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ఉక్కు శాఖా మంత్రి ఇక్కడికి వచ్చి నెల రోజులు దాటినా ఇప్పటివరకూ ఎటువంటి సాయం ప్రకటించలేదన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని కేంద్రంపై ఒత్తిడి పెట్టాలని, స్టీల్‌ప్లాంటుకు తగిన సాయం అందేలా చూడాలని కోరారు. కేంద్రం 30 శాతం ఉద్యోగులను తగ్గించాలని ఆదేశించిందని, వీఆర్ఎస్ కోసం రూ.1,400 కోట్లు కేటాయించారని, వర్కింగ్ కేపిటల్ అడిగితే ఉలుకూపలుకూ లేదన్నారు. సీఎండీ తీరును నిరసిస్తూ ఈ నెల 22న ఆయన కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రకటించారు. మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఐరన్‌ఓర్ కొనుగోళ్లలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. మరో నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, జగన్ సీఎం హోదాలో 22సార్లు ఢిల్లీలో ప్రధానిని కలిశారని, ఒక్కసారి కూడా విశాఖ ఉక్కు సమస్య గురించి ప్రస్తావించలేదన్నారు. చంద్రబాబునాయుడు కూటమి స్టీల్‌ప్లాంటును కాపాడతామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, తక్షణమే ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పోలవరం, అమరావతిలతో సమానంగా విశాఖ స్టీల్ సమస్య పరిష్కారానికి కృషిచేయాలన్నారు. సెప్టెంబరు నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు నరసింగరావు. పక్కన గుర్తింపు యూనియన్ నాయకుడు ఆదినారాయణ, రాజశేఖర్, తదితరులు

ఇచ్ఛాపురంలో విశాఖవాసి ఆత్మహత్య

ఇచ్ఛాపురం, ఆగస్టు 14: పట్టణంలోని ఓ లాడ్జిలో విశాఖలోని ఆరిలోవకు చెందిన దొడ్డి మంగరాజు (47)ఆత్మహత్యకు పాల్పడ్డారు. మద్యానికి బానిసై కుటుంబాన్ని పోషించలేక అతను ఇబ్బంది పడుతున్నాడు. భువనేశ్వర్ పనికోసం వెళ్లి అక్కడినుంచి మంగరాజు ఇచ్ఛాపురం చేరుకుని ఓలాడ్జిలో రూమ్ తీసుకుని ఉంటున్నాడు.ఈక్రమంలో మంగళవారంరాత్రి లాడ్జీలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.


ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు


రన్నింగ్, సైకిల్ యాత్ర ప్రారంభంలో డీసీపీ తుహిన్ సిన్హా


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న రైల్వే డీఆర్ఎం

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలి

- ›› భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- ›› 25 వేల అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ
- ››77 కిలో మీటర్ల రన్నింగ్, సైకిల్ యాత్ర ప్రారంభం

డాబాగార్డెన్స్, ఆగస్టు 14: స్వాతంత్ర్యోద్యమ ఫలాలను అందించిన మహనీయులు నిరంతరం స్మరించుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం సిటీ సెంట్రల్ పార్కు సమీపంలోని మహిళా కళాశాల ఎదుట 25 వేల అడుగుల భారీ జాతీయ పతాకంతో ర్యాలీ స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా జెండా ఉంచా రహే హమారా పేరుతో చేపట్టిన ఈ ర్యాలీలో జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య చిత్రపటానికి గంటా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమరయోధుల త్యాగాల స్ఫూర్తితో ముందుకుసాగాలన్నారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య తెలుగు వారు కావడం మనందరికీ గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారామ్, చిక్కాల విజయ్‌బాబు, స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ అధ్యక్షుడు బసవ కృష్ణమూర్తి, సుంకరి రమణమూర్తి, సి. మురళీనాయుడు, కె.శ్రీనివాస్, కె.రాంజీ, ఆర్. విఠల్, ట్రాఫిక్ ఏసీపీ ఎస్.వాసుదేవ్ పాల్గొన్నారు.


జ్ఞానాపురంలో ర్యాలీ

మహారాణిపేట: స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని చాటేలా.. విశాఖ ట్రైల్ రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్ అక్రాస్ 77 కిలోమీటర్ల పరుగు, సైకిల్ యాత్రలను నిర్వహిస్తున్నారు. బుధవారం బీచ్‌రోడ్డులోని కాళీమాతగుడి నుంచి డీసీపీ తుహిన్ సిన్హా ఈ యాత్ర ప్రారంభించారు. 26 మంది సభ్యులు పరుగులో, ఐదు గురు సైకిల్ యాత్రను చేయనున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 77 కిలో మీటర్లు 12 గంటలపాటు రన్, సైకిల్ యాత్రను చేయనున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఈ యాత్ర ద్వారా జనాల్లో జాతీయోద్యమ స్ఫూర్తి నింపడం అభినందనీయమనికొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు యోగేశ్వరరావు సెక్రటరీ కృష్ణ చైతన్య, రవి పాల్గొన్నారు.

జ్ఞానాపురం: 56వార్డులో యూసీడీ ఏపీడీ చిరంజీవి, సీఓ రమణి, ఆర్పీలు, సచివాలయ కార్యదర్శుల ఆధ్వర్యంలో ర్యాలీ ప్రారంభించారు. జ్ఞానాపురంలో సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ, ప్రోగ్రాం అధికారి కె.మాణిక్యకుమారి, డాక్టర్ ప్రవీణ్ బాబు, ప్రమీల, టోనియా, రాజేశ్ పాల్గొన్నారు.

వాల్తేరు రైల్వే స్టేషన్లలో ఫొటో ఎగ్జిబిషన్

విశాఖపట్నం: దేశ విభజనకు సంబంధించిన పలు అంశాలను ప్రతిబింబించే ఫొటో ఎగ్జిబిషన్‌ను విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్రారంభించారు. తొలుత డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ హాజరై అమర వీరులకు నివాళులర్పించారు. విశాఖలోనే కాకుండా విజయనగరం, శ్రీకాకుళం, రాయగడ, కోరాపుట్, జగదల్‌పూర్ స్టేషన్లలో కూడా ఈ ఫొటో ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, అధికారులు పాల్గొన్నారు.

ఆలయాల్లో హోం మంత్రి పూజలు

మహారాణిపేట/సిరిపురం, ఆగస్టు 14: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మహారాణిపేటలోని బెల్లం వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఆమె కుటుంబ సమేతంగా విచ్చేసి అర్చకుడు పద్మనాభ శర్మ చేతుల మీదుగా స్వామి వారికి బెల్లం మొక్కు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ అధికారులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ దేవుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని కోరుకున్నట్టు తెలిపారు.


బెల్లం వినాయకుని ఆలయంలో మంత్రి అనిత పూజలు

సిరిపురం: హోంమంత్రి వంగలపూడి అనిత బుధవారం సంపత్ వినాయగర్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ శిరీష, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ ఆమెకు స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలోశాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని చెప్పారు.

పోరాటాల పురిటి గడ్డ

... 7వ పేజీ తరువాయి

ఎదురుగా బీచ్‌లో ఉప్పు తయారుచేయాలని నిర్ణయించారు. దిగుమర్తి రామస్వామి, తెన్నేటి విశ్వనాథం, కె.ఎస్.గుప్త నాయకత్వంలో ఐదువేల మంది ఉప్పు తయారుచేశారు. దానిని వేలం వేయగా రూ.3 వేలువచ్చింది. ఏప్రిల్ 17న రామచంద్రశాస్త్రి, తెన్నేటి విశ్వనాథం, దిగుమర్తి రామస్వామి, కె.ఎస్.గుప్త, భమిడిపాటి చిన యజ్ఞనారాయణశర్మలను బ్రిటీష్ ప్రభుత్వం అరెస్ట్‌చేసింది. ఈ క్రమంలో ఉప్పు ఉద్యమం విశాఖ నుంచి భీమిలికి మారింది. దీంతో మిస్సుల సత్యనారాయణ, యల్లాజీ నారాయణరావు, గుడి పేర్రాజు, ప్రయోగ సత్యనారాయణలను అరెస్ట్‌చేసి నర్సీపట్నం కోర్టులో హాజరుపర్చారు. కోర్టు వారికి నెల రోజులు జైలు శిక్ష విధించింది. దీంతో మహిళలు ఉద్యమ బాధ్యతలు స్వీకరించారు. రామస్వామి సతీమణి దిగుమర్తి జానకీబాయి, రామశాస్త్రి భార్య శారదాంబలు ఉప్పు సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు.

● విదేశీ వస్తు బహిష్కరణలోనూ విశాఖ ప్రముఖ పాత్ర పోషించింది. 1932 జనవరి 11న ఉద్యమ నాయకులకు అప్పటి జిల్లా మేజిస్ట్రేట్ హెచ్‌పీ ఉజిలి హెచ్చరిక జారీచేశారు. విశాఖకు ఐదు కిలోమీటర్ల పరిధిలో సభలు, ఊరేగింపులు నిర్వహించరాదని ఆదేశించారు. అయినా విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమం నడిపినందుకు భమిడిపాటి రామదీక్షితులు, విజ్ఞపు రంగనాథం, దూర్వాసుల సాంబమూర్తి, వారణాసి సత్యనారాయణ, జయంతి లక్ష్మీనరసింహం, మహదేవశాస్త్రి, దూర్వాసుల రామకృష్ణ పరమహంస తదితరులను అరెస్టుచేశారు.

సిపాయిల తొలి తిరుగుబాటు ఇక్కడే..

... 7వ పేజీ తరువాయి

జరిగింది. ఆ తరువాత 1806లో తమిళనాడులోని వెల్లూరు, 1824లో బారక్‌పూర్ (పశ్చిమ బెంగాల్)లో సిపాయిల తిరుగుబాట్లు జరిగాయి. విశాఖలో జరిగిన తొలి సిపాయిల తిరుగుబాటులో బ్రిటీష్ సైన్యంలో ముగ్గురిని చంపిన దేశీయ సైనికులను అప్పటి పాలకులు ఉరితీశారు (బ్రిటీష్ మిలిట్రీ అధికారులు కాల్చారని కొన్నిచోట్ల ఉంది). 1780 సెప్టెంబరులో మైసూరు నవాబు హైదరాలీ, బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీకి మధ్య యుద్ధం మొదలైంది. ఆ యుద్ధంలో హైదరాలీ దాదాపు పైచేయి సాధించే పరిస్థితులు కనిపించడంతో ఆంగ్లేయులు అప్రమత్తమయ్యారు. మద్రాస్ రాష్ట్రంలో ఉత్తరాన విశాఖపట్నం, మచిలీపట్నంలో సైనిక దళాలు ఉండేవి. రెండుచోట్ల నుంచి దళాలను మైసూరు యుద్ధంలో పాల్గొనేలా ఆదేశాలు వచ్చాయి. మచిలీపట్నం రేవు నుంచి కొంత సైన్యం బయలుదేరింది. విశాఖలో గేండియర్స్ రెజిమెంట్ నుంచి సైన్యాన్ని ఓడలో మద్రాస్‌కు, అక్కడ నుంచి మైసూరుకు తీసుకువెళ్లాలని నిర్ణయించారు. అయితే 1780 అక్టోబరు మూడో తేదీన మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సైనికులు ఓడ ఎక్కడానికి తిరస్కరించారు. ఈ దశలో బ్రిటీష్ సైనికాధికారులు ఒత్తిడి తీసుకురావడంతో మహ్మద్ షేర్‌ఖాన్ నేతృత్వంలో కొందరు భారతీయ సిపాయిలు తిరగబడి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో బ్రిటీష్ సైన్యానికి చెందిన లెఫ్టినెంట్ క్రిప్స్, సైనికులు కింగ్స్ ఫోర్డ్ వెన్సర్, రూథర్‌ఫర్డ్ అనేవారు చనిపోయారు. కెప్టెన్ మేక్స్‌టన్, కెప్టెన్ లాన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా భారతీయ సైనికులు ఏకమై బ్రిటీష్ సైన్యానికి చెందిన ముఖ్య అధికారిని బందీ చేసి అక్కడ ఖజానా లూటీ చేసి రూ.21,999తోపాటు ఆయుధాలు తీసుకుని హైదరాలీకి మద్దతుగా యుద్ధంలో పాల్గొనేందుకు బయలుదేరారు. అయితే స్థానిక జమీందారుల సాయంతో మహ్మద్‌ఖాన్ మరికొంతమంది సైనికులను బ్రిటీష్ అధికారులు పాయకరావుపేట సమీపంలో పట్టుకుని విశాఖపట్నం తీసుకువచ్చారు. తొలుత కోర్టు మార్షల్ నిర్వహించి అతిక్రూరంగా హింసించి ఉరితీశారు.

ట్రాఫిక్ కంట్రోల్‌కు ఏఐ

... 7వ పేజీ తరువాయి

ట్రిపుల్ రైడింగ్ గుర్తించినా అలాగే చేస్తున్నారు. ఇకపై ఇవి కూడా ఏఐతోనే జనరేట్ అవుతాయి. జంక్షన్లలో ఏర్పాటుచేసే ఏఎన్‌పీఆర్ కెమెరాలు సిగ్నల్ జంపింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వెళ్లే వాహనాలను సులువుగా గుర్తిస్తాయి. ఆ వివరాలను ఫొటోలు, సమయంతో సహా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తాయి. దాంతో ఆటోమేటిక్‌గా ఆయా వాహనదారులకు చలానాలు వెళ్లిపోతాయి. ఏఐ టెక్నాలజీతో ఇన్ని రకాల ప్రయోజనాలు ఉండడంతో వాటిని వెంటనే ప్రయోగాత్మకంగా పరిశీలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు దేవమాత మోక్షారోపణ ఉత్సవం

జ్ఞానాపురం, ఆగస్టు 14: స్థానిక పునీతుపేతు ప్రధాన దేవాలయం ఆధ్వర్యంలో దేవమాత మోక్షరోపణ మహోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు దేవాలయం విచారణకర్తలు ఫాదర్ జోన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు. 1900లో జ్ఞానాపురంలో ప్రజలు కలరా వ్యాధితో మృతిచెందారని, ఆసమయంలో దివంగత పీటర్ రోసియోన్ బిషప్ గ్రామాన్ని దేవమాతకు సమర్పించగా వ్యాధి కనుమరుగైందన్నారు. అప్పటి నుంచి పురవీధుల్లో ఆగస్టు 1 నుంచి 14 రోజుల పాటు దేవమాత తేరుతో ప్రదక్షిణలు చేస్తూ 15న పండగను నేటికీ ఆనవాయతీగా జరుపుకుంటున్నామన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం 6 గంటలకు సమష్టి కృతజ్ఞతా దివ్యబలిపూజ గుహవద్ద నిర్వహించి 8.30కు డాక్టర్ పొలిమేర జయరావు జాతీయ పతాకంఆవిష్కరిస్తారన్నారు.


తెరు ప్రదక్షిణ చేస్తున్న విశ్వాసులు

బీసీల సమస్యలను పరిష్కరించాలి..

డాబాగార్డెన్స్, ఆగస్టు 14: బీసీ కులాలకు చెందిన పలు సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను విశాఖ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెబ్బిలి రవికుమార్ కోరారు. నగరానికి బుధవారం వచ్చిన మంత్రిని కలిసి బీసీల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ నగర అధ్యక్షుడు గండిబాబ్జీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఘనంగా సత్కరించారు.


మంత్రి సత్యప్రసాద్ జ్ఞాపిక ఇస్తున్న బీసీ నాయకులు

మైనారిటీ నాయకుల వినతి

మహారాణిపేట: విశాఖ జిల్లా టీడీపీ ముస్లిం మైనారిటీ సెల్ నాయకులు మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించి పలు విషయాలను చర్చించారు. ముస్లిం మైనారిటీల జిల్లా అధ్యక్షుడు షేక్ రహ్మతుల్లా, కార్య దర్శి మహ్మద్ గౌస్, వార్డు అధ్యక్షుడు గొంపా ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి కోసం బారులు

సీతమ్మధార, ఆగస్టు 14: సీతమ్మధార రైతుబజార్‌లో బుధవారం ఉల్లి కోసం జనం బారులుతీరారు. ఆది, సోమవారం అవసరాలకు తగిన ఉల్లి అందుబాటులో లేదు. దీంతో చాలా మంది వెనుదిరిగారు. మంగళవారం బజార్‌కు సెలవు. బుధవారం ఉల్లి కొనుగోలుకు జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గత వారం వరకు ఉల్లి కిలో రూ.36 ఉండగా బుధవారం కిలో 42లకు పెరిగింది. ధర పెరిగినప్పటికీ ఉల్లి కొనుగోలుకు జనం ఎగబడ్డారు.


సీతమ్మధార రైతుబజార్‌లో క్యూ

కిటకిటలాడిన మద్యం దుకాణాలు

సీతమ్మధార, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15వ తేదీన మద్యం దుకాణాలు బంద్ కావడంతో బుధవారం మందుబాబులు మద్యం కొనుగోలుకు ఎగబడ్డారు. సీతమ్మధార, సీతంపేట, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల్లో మద్యం దుకాణాల వద్ద రాత్రి 7 గంటల నుంచి జనం క్యూలు కట్టారు. రాత్రి 9 గంటలకు కుమ్ములాడుకునే పరిస్థితి నెలకొంది.


మద్యం దుకాణం వద్ద ఎగపడుతున్న మందుబాబు

ఐఐఎం తాగునీటి పైప్‌లైన్ల పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

- ›› అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గంభీరంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేపట్టిన భూగర్భ పైప్‌లైన్ పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఐఐఎం ఇనిస్టిట్యూట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం ఆర్‌డబ్ల్యుఎస్, ఐఐఎం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. గోస్తనీ నదిలో బోని నుంచి 12.5 కిలోమీటర్లు పైప్‌లైన్ ఏర్పాటు చేసి ఐఐఎంకు తాగునీటిని సరఫరా చేయాల్సి ఉందని, ఇప్పటి వరకు ఆరు కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ తెలిపారు. సమావేశంలో ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ ఆర్‌వీఎస్ చౌదరి, ఐఐఎం అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

విశాఖపట్నం: జిల్లాలో గృహనిర్మాణాలు పురోగతి సాధించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన సమీక్షించారు. లే అవుట్ల తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. వందరోజుల్లో 71వేల ఇళ్ల స్టేజ్ అప్డేషన్ జరగాలన్నారు. గృహనిర్మాణ శాఖ పీడీ డి.అఖిల, ఈఈ సత్యనారాయణ, డీఈలు రామకృష్ణ, సూర్యప్రకాశ్, సీతారాం, ఏఈ సూర్య ప్రకాశరావు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాము పరిశీలన

ఆరిలోవ: చినగదిలి తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఉన్న ఈవీఎంల గోదాములను కలెక్టర్ పరిశీలించారు. నెలవారీ తనిఖీల్లో భాగంగాఈవీఎంల సీళ్లు, సీసీ కెమెరాల పనితీరునుపరిశీలించి సిబ్బంది సూచనలిచ్చారు.

దోమల నివారణకు డ్రోన్ల వినియోగం: జీవీఎంసీ కమిషనర్

ఎండాడ, ఆగస్టు 14: నగరంలోని చెరువుల్లో దోమలు వృద్ధి చెందకుండా డ్రోన్ స్ప్రేయింగ్ యంత్రాలు వినియోగిస్తున్నామని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఎండాడ చెరువులో మలేరియా లార్వల్ ఆయిల్ (ఎంఎల్)ని డ్రోన్ల ద్వారా వెదజల్లే ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండాడ-రుషికొండ డబుల్ రోడ్డులో ఉన్న ట్రిబుల్‌ఆర్ సెంటర్ పరిశీలించారు. ఈ సెంటర్‌కి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలానికి రక్షణ గోడను నిర్మించాలని జెడ్సీ శైలజావల్లీని, ప్రభుత్వ స్థలంలోని దుకాణాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను టీడీపీ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. అదనపు కమిషనరు డీవీ రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ పాల్గొన్నారు.


డ్రోన్ వినియోగాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

పార్కు పనుల్లో జాప్యంపై ఆగ్రహం

ఆరిలోవ: ముడసర్లోవ పాత నర్సరీలో చేపడుతున్న చిల్డ్రన్ పార్కు పనుల్లో జాప్యంపై కమిషనర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కులో చెట్లను తొలగించకుండా నిర్మాణాలు చేపట్టాలని, నిర్మాణానికి అడ్డుగా ఉన్న వాటిని ట్రీ ట్రాన్స్ లోకేషన్ చేయాలన్నారు. ఓపెన్ ఎయిర్ థియేటర్, వాకింగ్ ట్రాక్, క్రీడా పరికరాలు, టాయిలెట్లు, తాగనీటి సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు.

డిగ్రీ కళాశాలల రుబాబు

... 7వ పేజీ తరువాయి

చేస్తున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధి కారులు దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోతోందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.రాష్ట్రంలో కొద్దిరోజుల కిందట కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. విద్యార్థులకు పూర్తి ఫీజును సంబంధిత కళాశాలల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించింది. ఉన్నత విద్యా శాఖా మంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు.అయితే, కాలేజీలు మాత్రం తమకు ప్రభుత్వం నుంచి ఫీజుల చెల్లింపునకు సంబంధించి ఎటువంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. ప్రభుత్వం పూర్తి ఫీజులను తమకు చెల్లిస్తే...విద్యార్థులు కట్టిన ఫీజులను వెనక్కి ఇచ్చేస్తామని కొన్ని కాలేజీలు చెబుతున్నాయి.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు: డీసీపీ

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 14: నేరాలకు పాల్పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని క్రైమ్ డీసీపీ వెంకటరత్నం హితవుపలికారు. బుధవారం ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. నేరాలకు పాల్పడిన వారిపై రౌడీ షీట్లు తెరుస్తామని హెచ్చరించారు. ఈనెల 12న వెంకోజీపాలెం వద్ద దారి దోపిడీకి పాల్పడిన నక్కవానిపాలేనికి చెందిన పిల్లా జయదీప్ (18), మరో ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకుని సెల్ ఫోన్, రూ. వెయ్యి నగదు, ఆటో స్వాధీనం చేసుకున్నామన్నారు. 13న జోడుగుళ్లపాలెం వద్ద జరిగిన మరో దోపిడీలో గద్దిపిల్లి సింహాద్రి (19), తాడి శేఖర్ (26), గాలి సూర్య ప్రకాశ్ (26), మామిడి ప్రశాంత్ (22)ను అదుపులోకి తీసుకుని, సెల్‌ఫోన్, రూ.500, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో క్రైమ్ ఏడీసీపీ మహేష్, జోన్ 1 ఏసీపీ వెంకటరావు, సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆరిలోవ ఎస్ఐ హరికృష్ణను అభినందించారు.

వివాహితను బ్లాక్‌మెయిల్ చేస్తున్న యువకుడి అరెస్టు

ఎండాడ, ఆగస్టు 14: ఇన్‌స్టాగ్రామ్‌లో వివాహితతో పరిచయం చేసుకుని, బ్లాక్‌మెయిల్ చేస్తున్న యువకుడిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కె.భవానీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన వివాహితతో ఒడిశారాష్ట్రానికి చెందిన సాఖ్యస్మిత్ (30) ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం చేసుకున్నాడు. ఆమె మొబైల్ నంబరు తెలుసుకుని వాట్సాప్ చాటింగ్‌తో మరింత దగ్గరయ్యాడు. ఈ క్రమంలో ఇద్దరూ శారీరకంగా ఒక్కటయ్యారు. ఆ సమయంలో వీడియో తీశాడు. వాటిని ఆమె కుటుంబసభ్యులకు పంపిస్తానని బ్లాక్‌మెయిల్ చేస్తుండడంతో ఆమె ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

యువకుడిని బెదిరించిన వ్యక్తి అరెస్టు

విశాలాక్షినగర్, ఆగస్టు 14: యువకుడిని బెదిరించి సెల్‌ఫోన్, నగదు అపహరించిన నిందితుడ్ని ఆరిలోవ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాకు చెందిన దాస్ జోడుగుళ్లపాలెంలోని హోటల్‌లో పని చేస్తుంటాడు. మంగళవారం నడిచి వెళుతుండగా సింహాద్రి అతడిని బెదిరించి సెల్‌ఫోన్, నగదు తీసుకున్నాడు. యువకుడు డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సింహాద్రిని అదుపులోకి తీసుకున్నారు.

వేలం ద్వారా అప్పన్నకు రూ.1.15 కోట్ల ఆదాయం

సింహాచలం, ఆగస్టు 14: వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలో పలు వ్యాపారాలకు నిర్వహించిన టెండర్ కమ్ బహిరంగ వేలం ద్వారా స్వామివారి ఖజానాకు సుమారు రూ.1.15 కోట్ల ఆదాయం సమకూరింది. ఈఓ కార్యాలయంలో డిప్యూటీ ఈఓ రాధ సారథ్యంలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. ప్రత్యేక పరిశీలకురాలిగా గ్రేడ్-1 ఈఓ ప్రసన్నలక్ష్మి హాజరయ్యారు. భక్తుల సెల్‌ఫోన్లు, కెమెరాలు భద్రపరిచేందుకు లైసెన్స్ ద్వారా రూ.69.5లక్షలు, క్లాక్‌రూమ్‌కు రూ.30,09,999 ఆదాయం వచ్చింది. సింహగిరి బస్టాండ్, కేశఖండనశాల, నాలుగు ప్రాంతాల్లో టీ, కాఫీ మెషీన్లు పెట్టుకోవడానికి రూ.16 లక్షలు లభించింది. ఇప్పటివరకు సెల్‌ఫోన్లు భద్రపరిచేందుకు రూ.5 వసూలు చేస్తుండగా, తాజగా రూ.10కి పెంచారు.

ఈస్ట్ క్యూ 6 బెర్త్ మెకనైజేషన్‌కు ఒప్పందం

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టులో ఈస్ట్ క్యూ 6 బెర్త్‌ను మెకనైజేషన్ చేయడానికి ఎవర్ సన్ మెరైన్ పోర్ట్‌తో బుధవారం ఒప్పందం చేసుకుంది. పీపీపీ విధానంలో 255 మీటర్ల పొడవు, 12.10 మీటర్ల లోతు పెంచనున్నారు. దీనివల్ల 200 మీటర్ల పొడవైన నౌకలను బెర్తింగ్ చేసుకోవచ్చు. దీనికి రూ.66.12 కోట్లు వెచ్చిస్తారు. కార్యక్రమంలో పోర్టు ఛైర్మన్ అంగముత్తు, డిప్యూటీ ఛైర్మన్ దుర్గేశ్‌కుమార్ దూబె పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

జాతీయ సేవా పథకం ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సర్వసిద్ధి హరినాథ్

మల్కాపురం, ఆగస్టు 14: యువతలో నిర్ణయాలు తీసుకునే శక్తి, సమయపాలన, వృత్తి, భాషాపరమైన నైపుణ్యాలు విజయానికి ఎంతో అవసరమని ఆంధ్ర విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం ప్రొగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ సర్వసిద్ధి హరినాథ్ పేర్కొన్నారు స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో బుధవారం నిర్వహించిన నూతన విద్యార్థినుల స్వాగత సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కళాశాలలో చేరిన వారు ముందుగా తమ నైపుణ్యాలకు పదును పెట్టుకోవాలన్నారు. అవకాశాలను సృష్టించుకుంటూ విజయాలను సొంతం చేసుకోవాలని కోరారు. చదువుతోపాటు ఎన్ఎస్ఎస్, క్రీడలు, ఇతర రంగాల్లోనూ ప్రతిభ చూపాలని కోరారు. సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అధ్యక్షత వహించగా, కరస్పాండెంట్ సిస్టర్ గెసెల్లా, జూనియర్ కళాశా ప్రిన్సిపాల్ సిస్టర్ కేత్లీన్, అధ్యాపకులు, సీనియర్ విద్యార్థులు మాట్లాడారు. అనంతరం వివిధ పోటీలలోని విజేతలకు బహుమతులందించారు. ఈసందర్భంగా డాక్టర్ సిర్వసిద్ధి హరినాథ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రొగ్రామ్ అధికారి ఇపీఎస్ భాగ్యలక్ష్మితో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న డాక్‌యార్డు ఉద్యోగులు


డాక్‌యార్డు గేటు వద్ద ధర్నా కారణంగా నిలిచిపోయిన వందలాది వాహనాలు

ఎస్‌బీసీ వంతెనపై రాకపోకలకు అవకాశం కల్పించాలి

డాక్‌యార్డు విజయనగరం గేటు వద్ద ఐఎన్‌సీఈయూ, ఎన్‌సీఈయూ ధర్నా

మల్కాపురం, ఆగస్టు 14: డాక్‌యార్డు సమీపంలో సర్దార్ వల్లాబాయ్ పటేల్ (ఎస్‌వీపీ) వంతెన పునఃనిర్మాణం నేపథ్యంలో దీనిని మూసివేయడంతో షిప్ బిల్డింగ్ సెంటర్ (ఎస్‌బీసీ) వంతెన పైనుంచి రాకపోకలకు అవకాశం కల్పించాలని కోరుతూ ఇండియన్ నేవీ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌సీఈయూ), నేవల్ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎన్‌సీఈయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డాక్‌యార్డు విజయనగరం గేటు వద్ద ధర్నా చేశారు. దీంతో వందలాది వాహనాలతో ఉద్యోగులు డాక్‌యార్డు ఎదురుగా నిలిచిపోయారు. వారంతా డాక్‌యార్డులోకి వెళ్లడానికి సుమారు గంటకు పైగానే సమయం పట్టింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్‌వీపీ వంతెన మూసివేతతో డాక్‌యార్డుకు చేరుకోవడానికి చుట్టూ పది కిలో మీటర్ల దూరం తిరిగి రావాలిస వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఇప్పుడు వస్తున్న రోడ్డులో దుమ్ము, ధూళితో నిండిపోయి ఉండడంతో ప్రయాణం కష్టతరంగా ఉంటుందన్నారు. అందువల్ల తూర్పు నౌకాదళం ముఖ్య అధికారులు స్పందించి ఎస్‌బీసీ వంతెన పైనుంచి రాకపోకలు సాగించే విధంగా చర్యలు చేపట్టాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలు యూనియన్ల ప్రతినిధులతో పాటు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.


కాఫీ పొడితో విద్యార్థులు వేసిన మహనీయుల చిత్రాలు


కాగితాలతో తయారుచేసిన మువ్వన్నెల బ్యాడ్జీలు

చిత్రలేఖనం, కళాకృతుల తయారీలో ప్రతిభ చూపిన విద్యార్థులు

అగనంపూడి, ఆగస్టు 14: జీవీఎంసీ 85వ వార్డు పరిధి గొన్నవానిపాలెంలో గల ఏబీఎస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు చిత్రలేఖనం, కళాకృతుల పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వినూత్నంగా కాఫీ పొడిని ఉపయోగించి మహనీయులైన జాతిపిత మహాత్మాగాంధీ, భగత్‌సింగ్, అంబేడ్కర్, సుభాశ్ చంద్రబోస్ చిత్రాలను వేశారు. అదేవిధంగా మూడు రంగుల కాగితాలతో రిబ్బన్లు, బ్యాడ్జీలను తయారుచేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ పద్మజ, డైరెక్టర్ దీపక్ అభినందించారు.

పబ్లిక్ నోటీస్

ఇండియన్ సక్సెషన్ యాక్ట్ సెక్షన్ 32 ప్రకారం
Succession Certificate
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, గాజువాక
S.O.P. No. 8/2024

పిటీషన్ :
1. ఎల్లబెల్లి కావేరి, 2. గుమ్మడి అదిలక్ష్మి
3. ఎల్లబెల్లి శ్రీలత, 4. పలివెల నరసింగరావు ...పిటిషనర్లు

మరియు
శ్రీ కె.తిరుమలరావు, సీనియర్ మేనేజర్, H.R. డిపార్ట్‌మెంట్ (S.P & TPP) రాష్ట్రీయ ఇస్పాట్ నిగమ్ లిమిటెడ్ స్టీలుప్లాంటు, విశాఖపట్నం ..రెస్పాండెంటు

పై తెలిపిన పిటీషనర్లు, చనిపోయిన పలివెల అప్పారావు గారి పేరున రెస్పాండెంటు కంపెనీలో యున్న టెర్మినల్ సొమ్మును అతని వారసులుగా పొందుటకు గాను అవసరమగు సక్సెషన్ సర్టిఫికెటు ఇప్పించగోరి పిటీషను దాఖలు చేసి యున్నందున, అందు గురించి ఎవరికి అయినా ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల తేది. 9-9-2024వ ఉదయం గం॥10-30 నిలకు కోర్టువారి హాజరై మనవి చేసుకొనవలయును. అటుల పిమ్మట పిటీషనర్లు కోరిన పరిహారము నెరవేర్చబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

ఎస్.రమణబాల, అడ్వకేట్
గాజువాక, విశాఖపట్నం
ఫోన్ : 9848430799
గాజువాక
తేది. 12-8-2024


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

గౌతు లచ్చన్న జయంతి వేడుకల కరపత్రాలు ఆవిష్కరణ

పెదగంట్యాడ, ఆగస్టు 15: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతి వేడుకలను ఈ నెల 16న సమతానగర్‌లో పారిశ్రామిక ప్రాంత గీత సహ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం సంఘ కార్యాలయంలో అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు, ప్రధాన కార్యదర్శి వనమి నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు నెల్లి సాధూరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ గౌతు లచ్చన్న జయంతి రోజున పేదలకు చీరలు పంపిణీ చేయడంతో పాటు 75 ఏళ్ల పైబడిన సంఘ సభ్యులకు, తమకు సహకారాన్ని అందిస్తున్న వారిని సత్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే గౌతు శిరీష, తదితరులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు యలమంచిలి మంగరాజు, దేవన్ రాజు, ఎ.పెదనూకరాజు, నెల్లి శ్రీనివాసరావు, జె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.


జీఎంను సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కలెక్టివ్ ప్రతినిధులు

స్టీల్‌ప్లాంట్ జీఎంకు సత్కారం

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 14: స్టీల్‌ప్లాంట్ జీఎం (మెకానికల్)గా బాధ్యతలు చేపట్టిన ఎన్.వీరేశంను ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కలెక్టివ్ ప్రతినిధులు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. ప్లాంట్‌లో అంచెలంచెలుగా ఎదిగిన వీరేశం కార్మిక వర్గానికి ఎనలేని సేవలందించారన్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సంస్థ ప్రగతి, ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏ సహకారం కావాలన్నా తనను సంప్రతించవచ్చని వారికి సూచించారు. కార్యక్రమంలో ప్రతినిధులు జి.సురేశ్, కొమ్ము ప్రసాద్, బీపీ స్వామి, డేవిడ్, లక్ష్మీనాయక్, ప్రతిమ, కొండబాబు, సాల్మాన్ రాజు, అరవింద్ కృష్ణ, మూర్తి పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

మల్కాపురం, ఆగస్టు 14: హిందుస్థాన్ షిప్‌యార్డు స్పోర్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో షిప్‌యార్డుకాలనీలో పది రోజులుగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. పోటీల్లో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సుమారు 200 మంది పాల్గొన్నారు. వాలీబాల్‌లో డిజైన్ టీమ్, క్రికెట్‌లో వార్ ఆన్ టెర్రర్ జట్టు విజేతలుగా నిలిచారు. విజేతలకు సంస్థ డైరెక్టర్ గిరిధర్‌సింగ్ బహుమతులందజేశారు.





86 అడుగుల జాతీయ పతాకంతో కణితి హైస్కూల్ విద్యార్థుల ర్యాలీ



పెందుర్తిలో భారీ జెండాతో ర్యాలీ

సందడిగా హర్ ఘర్ తిరంగా

మువ్వన్నెల పతాకాలతో పలు ప్రాంతాల్లో ర్యాలీలు

కూర్మన్నపాలెం, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా ర్యాలీలను బుధవారం పలు ప్రాంతాల్లో సందడిగా నిర్వహించారు. ఇందులో భాగంగా 87వ వార్డు పరిధి కణితి హై స్కూల్ విద్యార్థులు 86 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ చేపట్టారు. తొలుత ఈ ర్యాలీని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ కరణంరెడ్డి నరసింగరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి భావాన్ని ప్రేరేపించేదే జాతీయ జెండా అని అన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల జీవితాలను విద్యార్థులంతా ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ ప్రజలంతా తమ ఇళ్లపై మువ్వన్నెల పతాకాలను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.సూర్యప్రకాశ్, నాయకులు బొండా ఎల్లాజీ, లక్కరాజు సోంబాబు, బి.నాగేశ్వరరావు, కాదా శ్రీను, దినేశ్, తదితరులు పాల్గొన్నారు.

భవితా కేంద్రంలో..

స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల జీవిత గాథలను తెలుసు కుని, వారి ఆశయ సాధన కోసం విద్యార్థులు కృషి చేయాలని ఎంఈవోలు సునీత, విశ్వనాథం, జిల్లా సమగ్రశిక్ష అభియాన్ ఐఈ కో-ఆర్డినేటర్ బి.గీత అన్నారు. వడ్లపూడిలోని భవితా కేంద్రంలో నిర్వహించిన కార్యక్ర మంలో పలువురు విద్యార్థులు జాతీయ గీతాలను ఆలపించారు. నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఉమాదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెందుర్తి: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ నియోజవర్గ అధ్యక్షుడు గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో వందడుగుల జెండాతో ర్యాలీ చేపట్టారు. వివిధ కళాశాలల విద్యార్థులు జాతీయ పతాకంతో స్థానిక కళాశాల నుంచి పెందుర్తి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. సార్వభౌమత్వం, దేశా భివృద్ధిని వివరించేందుకే ఈ ర్యాలీని చేపట్టామని రామునాయుడు తెలిపారు. అలాగే స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో 78 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. కాలేజీ ప్రాంగణం నుంచి పోలీస్ స్టేషన్ కూడలి వరకు ర్యాలీ సాగింది. కరస్పాండెంట్ టి.థియోఫిలస్, ప్రిన్సిపాల్ ఫ్లోరా, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: నడుపూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు నిర్వాసిత కాలనీల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్, 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి ఈ ర్యాలీని ప్రారంభించారు. స్కూల్ ఆవరణ నుంచి ప్రారంభమైన ర్యాలీ ముల్లివానిపాలెం, అయ్యన్నపాలెం, నెల్లిముక్కు, సీతానగరం, దుర్గవానిపాలెం ప్రధాన రహదారుల మీదుగా పెదగంట్యాడ జంక్షన్ వరకు సాగింది. కార్యక్రమంలో ఎంఈవోలు ఈ.శ్రీనివాసరావు, కె.రమణాజీ, జబర్దస్త్ ఫేమ్ సత్తిపండు, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య సంబరాల్లో భవిత కేంద్రం విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: విద్యార్థులంతా స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలుసుకోవడంతో పాటు వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం అన్నారు. కాలనీలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరాటాల పురిటి గడ్డ

... 7వ పేజీ తరువాయి

ఎదురుగా బీచ్‌లో ఉప్పు తయారుచేయాలని నిర్ణయించారు. దిగుమర్తి రామస్వామి, తెన్నేటి విశ్వనాథం, కె.ఎస్.గుప్త నాయకత్వంలో ఐదువేల మంది ఉప్పు తయారుచేశారు. దానిని వేలం వేయగా రూ.3 వేలువచ్చింది. ఏప్రిల్ 17న రామచంద్రశాస్త్రి, తెన్నేటి విశ్వనాథం, దిగుమర్తి రామస్వామి, కె.ఎస్.గుప్త, భమిడిపాటి చినయజ్ఞనారాయణశర్మలను బ్రిటీష్ ప్రభుత్వం అరెస్ట్‌చేసింది. ఈ క్రమంలో ఉప్పు ఉద్యమం విశాఖ నుంచి దిమిలికి మారింది. దీంతో మిస్సుల సత్యనారాయణ, యల్లాజీ నారాయణరావు, గుడి పేర్రాజు, ప్రయోగ సత్యనారాయణలను అరెస్ట్‌చేసి నర్సీపట్నం కోర్టులో హాజరుపర్చారు. కోర్టు వారికి నెల రోజులు జైలు శిక్ష విధించింది. దీంతో మహిళలు ఉద్యమ బాధ్యతలు స్వీకరించారు. రామస్వామి సతీమణి దిగుమర్తి జానకీబాయి, రామశాస్త్రి భార్య శారదాంబలు ఉప్పు సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు.

● విదేశీ వస్తు బహిష్కరణలోనూ విశాఖ ప్రముఖ పాత్ర పోషించింది. 1932 జనవరి 11న ఉద్యమ నాయకులకు అప్పటి జిల్లా మేజిస్ట్రేట్ హెచ్‌పీ ఉజిలి హెచ్చరిక జారీచేశారు. విశాఖకు ఐదు కిలోమీటర్ల పరిధిలో సభలు, ఊరేగింపులు నిర్వహించరాదని ఆదేశించారు. అయినా విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమం నడిపినందుకు భమిడిపాటి రామదీక్షితులు, విజ్జపు రంగనాథం, దూర్వాసుల సాంబమూర్తి, వారణాసి సత్యనారాయణ, జయంతి లక్ష్మీనరసింహం, మహదేవశాస్త్రి, దూర్వాసుల రామకృష్ణ పరమహంస తదితరులను అరెస్టుచేశారు.

ట్రాఫిక్ కంట్రోల్‌కు ఏఐ

... 7వ పేజీ తరువాయి

ట్రిపుల్ రైడింగ్ గుర్తించినా అలాగే చేస్తున్నారు. ఇకపై ఇవి కూడా ఏఐతోనే జనరేట్ అవుతాయి. జంక్షన్లలో ఏర్పాటుచేసే ఏఎన్‌పీఆర్ కెమెరాలు సిగ్నల్ జంపింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వెళ్లే వాహనాలను సులువుగా గుర్తిస్తాయి. ఆ వివరాలను ఫొటోలు, సమయంతో సహా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తాయి. దాంతో ఆటోమేటిక్‌గా ఆయా వాహనదారులకు చలానాలు వెళ్లిపోతాయి. ఏఐ టెక్నాలజీతో ఇన్ని రకాల ప్రయోజనాలు ఉండడంతో వాటిని వెంటనే ప్రయోగాత్మకంగా పరిశీలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

సిపాయిల తొలి తిరుగుబాటు ఇక్కడే..

... 7వ పేజీ తరువాయి

జరిగింది. ఆ తరువాత 1806లో తమిళనాడులోని వెల్లూరు, 1824లో బారక్‌పూర్ (పశ్చిమ బెంగాల్)లో సిపాయిల తిరుగుబాట్లు జరిగాయి. విశాఖలో జరిగిన తొలి సిపాయిల తిరుగుబాటులో బ్రిటీష్ సైన్యంలో ముగ్గురిని చంపిన దేశీయ సైనికులను అప్పటి పాలకులు ఉరితీశారు (బ్రిటీష్ మిలట్రీ అధికారులు కాల్చారని కొన్నిచోట్ల ఉంది). 1780 సెప్టెంబరులో మైసూరు నవాబు హైదరాలీ, బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీకి మధ్య యుద్ధం మొదలైంది. ఆ యుద్ధంలో హైదరాలీ దాదాపు పైచేయి సాధించే పరిస్థితులు కనిపించడంతో ఆంగ్లేయులు అప్రమత్తమయ్యారు. మద్రాస్ రాష్ట్రంలో ఉత్తరాన విశాఖపట్నం, మచిలీపట్నంలో సైనిక దళాలు ఉండేవి. రెండుచోట్ల నుంచి దళాలను మైసూరు యుద్ధంలో పాల్గొనేలా ఆదేశాలు వచ్చాయి. మచిలీపట్నం రేవు నుంచి కొంత సైన్యం బయలుదేరింది. విశాఖలో గేండియర్స్ రెజిమెంట్ నుంచి సైన్యాన్ని ఓడలో మద్రాస్‌కు, అక్కడ నుంచి మైసూరుకు తీసుకువెళ్లాలని నిర్ణయించారు. అయితే 1780 అక్టోబరు మూడో తేదీన మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సైనికులు ఓడ ఎక్కడానికి తిరస్కరించారు. ఈ దశలో బ్రిటీష్ సైనికాధికారులు ఒత్తిడి తీసుకురావడంతో మహ్మద్ షేర్‌ఖాన్ నేతృత్వంలో కొందరు భారతీయ సిపాయిలు తిరగబడి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో బ్రిటీష్ సైన్యానికి చెందిన లెఫ్టినెంట్ క్రిప్స్, సైనికులు కింగ్స్ ఫోర్డ్ వెన్నర్, రూథర్‌ఫర్డ్ అనేవారు చనిపోయారు. కెప్టెన్ మేక్స్‌టన్, కెప్టెన్ లాన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా భారతీయ సైనికులు ఏకమై బ్రిటీష్ సైన్యానికి చెందిన ముఖ్య అధికారిని బందీ చేసి అక్కడ ఖజానా లూటీ చేసి రూ.21,999తోపాటు ఆయుధాలు తీసుకుని హైదరాలీకి మద్దతుగా యుద్ధంలో పాల్గొనేందుకు బయలుదేరారు. అయితే స్థానిక జమీందారుల సాయంతో మహ్మద్‌ఖాన్ మరికొంతమంది సైనికులను బ్రిటీష్ అధికారులు పాయకరావుపేట సమీపంలో పట్టుకుని విశాఖపట్నం తీసుకువచ్చారు. తొలుత కోర్టు మార్షల్ నిర్వహించి అతిక్రూరంగా హింసించి ఉరి తీశారు.

డిగ్రీ కళాశాలల రుబాబు

... 7వ పేజీ తరువాయి

చేస్తున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధి కారులు దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోతోందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

స్పష్టత లేకపోవడంతో సమస్య

రాష్ట్రంలో కొద్దిరోజుల కిందట కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. విద్యార్థులకు పూర్తి ఫీజును సంబంధిత కళాశాలల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించింది. ఉన్నత విద్యా శాఖా మంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. అయితే, కాలేజీలు మాత్రం తమకు ప్రభుత్వం నుంచి ఫీజుల చెల్లింపునకు సంబంధించి ఎటువంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. ప్రభుత్వం పూర్తి ఫీజులను తమకు చెల్లిస్తే..విద్యార్థులు కట్టిన ఫీజులను వెనక్కి ఇచ్చేస్తామని కొన్ని కాలేజీలు చెబుతున్నాయి.



త్రివర్ణ పతాకాలతో స్కేటింగ్

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ స్కేటింగ్ రింక్‌లో క్రీడాకారులు బుధవారం త్రివర్ణ పతాకాలను చేతపట్టుకుని స్కేటింగ్ చేసి అందరినీ అబ్బురపరిచారు. ఈ సందర్భంగా స్కేటింగ్ కోచ్ అమిత్ గడాయి మాట్లాడుతూ దేశభక్తితో విద్యార్థులంతా ముందుకు సాగాలని, దేశ గౌరవాన్ని పెంచేలా భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. స్టీల్‌ప్లాంటులో ఎంతో వేడుకగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని స్కేటింగ్ రింక్‌లో జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు కాశీ, గోపి, క్రీడా విభాగం అధికారులు, ఉద్యోగులు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.



తివర్ణ పతాకాలతో స్కేటింగ్ చేస్తున్న క్రీడాకారులు

దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌కు సీమంతం

కూర్మన్నపాలెం, ఆగస్టు 14: దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న చోడమ్మకు బుధవారం సహచర మహిళా కానిస్టేబుళ్లు, సిబ్బంది సీమంతం చేశారు. ఈ సందర్భంగా సీఐ ఎర్రంనాయుడు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది కష్టసుఖాల్లో ఉన్నతాధికారులు అండగా ఉంటారన్నారు. విధి నిర్వహణలో అందరూ చిత్తశుద్ధితో పనిచేసి ప్రజలకు సేవలందించాలన్నారు. స్టేషన్‌లోని సిబ్బంది అంతా కలిసికట్టుగా తనకు సీమంతం చేయడం ఎంతో ఆనందంగా ఉందని చోడమ్మ పేర్కొంది. కార్యక్రమంలో ఎస్ఐలు సూర్యనారాయణ, శ్రీనివాసరావు, హెచ్‌సీలు రాజు, ప్రసాద్, సూరిబాబు, మహిళా సిబ్బంది సుశీల, స్పందన, తదితరులు పాల్గొన్నారు.



కానిస్టేబుల్ చోడమ్మ సీమంతం చేసిన సీఐ ఎర్రంనాయుడు, తదితరులు

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

పెందుర్తిరూరల్, ఆగస్టు 14: ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటిని పరిరక్షించాలని కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. పురుషోత్తపురం గౌరివిశ్వేరస్వామి ఆలయ పరిసరాల్లో బుధవారం ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు చందూయాదవ్, రమణమూర్తి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



69వ వార్డులో కార్పొరేటర్ పర్యటన

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 14: జీవీఎంసీ 69వ వార్డు పరిధిలోని నాతయ్యపాలెం, తుంగ్లాం కాలనీలో బుధవారం కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పర్యటించారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో నాతయ్యపాలెంలో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాలనీ నాయకులు సంద్రాన భాస్కర్, జి.దేముడు, చిన సన్యాసిరావు, ఎస్.వరహాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీడబ్ల్యూసీ ఎదుట మైనర్ బాలిక హాజరు


పెందుర్తి, ఆగస్టు 14: కన్నతల్లి అమానుష ప్రవర్తనతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందిన బాలికను బుధవారం పెందుర్తి పోలీసులు నగరంలోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచారు. ఆ బాలిక అభీష్టం మేరకు తల్లిదండ్రుల వద్దకు పంపించాలని కమిటీ ప్రతినిధులు నిర్ణయించినట్టు ఎస్ఐ అసిరి తాత తెలిపారు. పెందుర్తికి చెందిన స్వాతి ఇంటి పనులు చేయడం లేదని తన కుమార్తెను విచక్షణారహితంగా కొట్టి గాయపరిచిన సంగతి తెలిసిందే.

కాంట్రాక్టు కార్మికులకు జీతాలు నిలిపివేస్తాం

స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టర్లు అల్టిమేటం

ఆరు నెలలుగా పెండింగ్ పెట్టిన బిల్లులు తక్షణం చెల్లించాలని డిమాండ్

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 14: తమకు ఆరు నెలలుగా పెండింగ్ పెట్టిన బిల్లులు తక్షణమే చెల్లించాలని, లేకుంటే సెప్టెంబరు నెలలో కాంట్రాక్టు కార్మికులకు జీతాలను ఇవ్వబోమని స్టీల్ ప్లాంటు కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. ప్లాంటులో బుధవారం సమావేశమైన కాంట్రాక్టర్లు మాట్లాడుతూ బిల్లులు చెల్లించకుండా యాజమాన్యం వేధిస్తుందని, తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బిల్లుల విషయమై పలుమార్లు వినతులు సమర్పించినా ఎలాంటి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా ఉక్కు యాజమాన్యం స్పందించకపోతే సెప్టెంబరు నెల నుంచి కాంట్రాక్టు కార్మికుల జీతాలు, ఇన్సూరెన్స్ పాలసీ చెల్లింపు నిలిపివేయాలని నిర్ణయించుకున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు బొడ్డ సన్యాసిరావు, పి.అప్పలనాయుడు, టి.చక్రధర్‌రెడ్డి, శ్రీను, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



సినిమా గైడ్

- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-1 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** మెలోడి, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, కామేశ్వరి, మోహిని (గాజువాక)
- **సూపర్‌డీలక్స్ :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **బడ్డీ :** సౌజన్య (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** శారద, సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

దేశ విభజన ప్రజలకు గాయాన్ని మిగిల్చింది: ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, ఆగస్టు 14: స్వాతంత్ర్యం అనంతరం జరిగిన దేశ విభజన ప్రజల హృదయాల్లో గాయాన్ని మిగిల్చిందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. బీజేపీ నియోజవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తాండ్రపాపారాయుడు భవన్‌లో భారత దేశ విభజన భయానక స్మారక దినాన్ని పురస్కరించుకుని సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి లభించిన స్వాతంత్ర్యంతో పాటు విభజనలో జరిగిన హింసాత్మక సంఘటనలు మాయని మచ్చగా మిగిలాయన్నారు. దీనిని గుర్తు చేసుకునేందుకే పీఎం మోదీ స్మారక దినాన్ని ప్రకటించారన్నారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ విభజన సమయం దేశం అతలాకుతలమైందని, ఇది జాతీయ విషాద సంఘటన అని అన్నారు. సదస్సులో నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కె.వెంకటసన్యాసిరావు, రెడ్డి నారాయణరావు, అయిత సింహాచలం, సుఖవాసి అజయ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 42, టమాటా 26, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 18, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 36, బీరకాయలు 30, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 38, క్యాబేజీ 26, క్యారెట్ 28, దొండకాయలు 34, బంగాళదుంపలు 36, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 145, బరబటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 36, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 195, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 34, కీరదోస 30, క్యాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 86, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	490
విజయనగరం	494
శ్రీకాకుళం	494

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	78
ఫారం ధర	--	98
విత్ స్కిన్	--	166
స్కిన్‌లెస్	--	176

శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఆహ్వానం

వేపగుంట, ఆగస్టు 14: భరత్‌నగర్‌లోని శ్రీగోపీజనవల్లభస్వామి ఆలయంలో ఈ నెల 26న జరిగే శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరుతూ పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను బుధవారం అందజేశారు. అలాగే జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ పీవీ నరసింహంన్ని కూడా ఆహ్వానించారు. కార్యక్రమంలో సభ్యులు మామిడి దుర్గాప్రసాద్, కోటేశ్వరరావు, గోపాలరావు, నూకరాజు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో రక్త పరీక్షలు

సింధియా, ఆగస్టు 14: జీవీఎంసీ 62వ వార్డు పరిధిలో బుధవారం మలేరియా సబ్ యూనిట్ సిబ్బంది సామూహిక రక్త పరీక్షలు నిర్వహించారు. క్రాంతినగర్ పీహెచ్‌సీ పరిధిలోగల ఈ రక్త పరీక్షలు చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి రక్తం శాంపిల్స్ సేకరించారు. జిల్లా మలేరియా హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. హెల్త్ అసిస్టెంట్ రోమాల వేణుబాబు, జీవీఎంసీ మలేరియా సూపర్ వైజర్ డి.శ్రీనివాసరావు, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి జర్నలిస్టుల ఇళ్ల సమస్య: ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, ఆగస్టు 14: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గోపాలపట్నంలోని గణబాబును ఆయన నివాసంలో జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాలను వివరించారు. అందుకు స్పందించిన గణబాబు జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవ అధ్యక్షుడు జి.జనార్దనరావు, అధ్యక్షుడు బి.రవికాంత్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుతో రైతులకు మేలు

పెందుర్తి, ఆగస్టు 14: ఈ-క్రాప్ నమోదుతో రైతులకు మేలు చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్ అన్నారు. సరిపల్లి, గుర్రమ్మపాలెంలో ఆయన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఈ క్రాప్ నమోదు ప్రయోజనాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఏడీఈ మాణిక్యమాంబ పాల్గొన్నారు.



భక్తులకు మరింత రుచికరంగా అన్నప్రసాదం

సింహాచలం దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి


భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఈఓ శ్రీనివాసమూర్తి

సింహాచలం, ఆగస్టు 14 : వరాహలక్ష్మీనృసింహస్వామి అన్నప్రసాదాన్ని భక్తులకు మరింత రుచికరంగా అందించనున్నట్టు ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి తెలిపారు.అన్నప్రసాద విభాగం 36వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆయన అన్నప్రసాద భవనంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ప్రసాదాన్ని భక్తులకు వడ్డించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దాతలు కోరిన రోజున అన్నప్రసాదాన్ని అందజేయడానికి,వారి సేవలు పొందడానికి వీలుగా సింహగిరిపై ప్రత్యేక డోనర్ సెల్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే రాష్ట్రంలోని ఇతర దేవాలయాల్లో అమలు చేస్తున్నట్టుగానే సింహాచలం దేవస్థానంలో కూడా దాతలకు త్వరలో డిజిటల్ డోనార్ కార్డులు ప్రవేశపెట్టను న్నట్టు చెప్పారు. ప్రస్తుత అన్న ప్రసాద భవనంలో పైఅంతస్తులో లడ్డూ, పులిహోర తయారు చేస్తుండడంతో అన్న ప్రసాద వితరణకు కొంత అసౌకర్యంగా ఉందని, దాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రసాదాల తయారీ భవనానికి సమీపంలోనే మరో నూతన భవనం నిర్మించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు రమణాచార్యులు, ఈఈ శ్రీనివాసరాజు, ఏఈఓ ఆనంద కుమార్, ఇన్‌చార్జి ఏఈఓ పాలూరి నరసింగరావు, పర్యవేక్షణాధికారులు పిళ్లా శ్రీనివాసరావు. సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

సాగర తీరంలో 'ఫ్రీడమ్ ఫర్ చైల్డ్ గర్ల్'

రామ్‌నగర్, ఆగస్టు 14 :బాలికలపై లైంగిక వేధింపులు ఆపాలని, ఆడ పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వాలంటూ విద్యార్థులు నినదించారు.బుధవారం ఆర్కే బీచ్‌లో సీపీఈ ఎడ్యూకేషనల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఫ్రీడమ్ ఫర్ గర్ల్ చైల్డ్ పేరిట ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీచ్ రోడ్డులో 200 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తూ, స్వాతంత్ర్య సమరయోధులు, మహిళా నాయకుల గురించి పిల్లలకు అవగాహన కల్పించారు.

బదిలీపై వెళుతున్న సిబ్బందికి సన్మానం

కొమ్మాది, ఆగస్టు 14 : పదోన్నతి మరింత బాధ్యత పెంచుతుందని ఇన్‌చార్జి కమాండెంట్ సీహెచ్ పద్మనాభ రాజు అన్నారు. బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో ఆరుగురు అసిస్టెంట్ రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్లు రిజర్వు ఇన్‌స్పెక్టర్లుగా పదన్నోతి పొంది వివిధ బెటాలియన్‌లకు బదిలీపై వెళుతున్న సందర్భంగా బుధవారం వారిని ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ వి. నారాయణ, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

భీమిలిలో 'హర్ ఘర్ తిరంగా'

భీమునిపట్నం, ఆగస్టు 14 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి, ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో ఆర్డినేటర్ డా. బి. సహదేవుడు, రూస కో ఆర్డినేటర్ బి. ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బీచ్‌రోడ్ గాంధీజీ పార్కులో హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛభారత్ నిర్వహించారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ 3వ వార్డు అధ్యక్షురాలు కంటుభుక్త సునీత, తెలుగు యువత నాయకుడు కనకల అప్పలనాయుడు, బీజేపీ నాయకుడు పోలుబోతు విజయ, చెన్నా రాము, ప్రసాద్ పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు గడువు పెంపు

భీమునిపట్నం, ఆగస్టు 14 : పట్టణంలోని ప్రభుత్వ ఎస్‌వీఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 16వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విష్ణుమూర్తి తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రతించాలని సూచించారు.

ఎన్ఎస్ఎస్ టీ షర్టు, క్యాప్ ఆవిష్కరణ

వెంకోజీపాలెం, ఆగస్టు 14 : ఎన్ఎస్ఎస్ యూనిట్ 2, ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ఆధ్వర్యంలో ఆ విభాగంలోని పీటర్ ట్రక్కర్ స్మార్ట్ సెమినార్ హాల్‌లో గురువారం ఎన్ఎస్ఎస్ టీ షర్టు, క్యాప్‌ల ఆవిష్కరణ జరిగింది. విభాగం ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు వీటిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎఫ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య హరినాథ్, సెక్యూరిటీ అండ్ ట్రాన్స్‌పోర్ట్ డీన్ ఆచార్య అరుణకుమార్, హనరరీ లైబ్రేరియన్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, ఫ్యాకల్టీ చైర్మన్ ప్రొఫెసర్ ఉమాదేవి, డాక్టర్ కేవీ రమణమూర్తి, ఆచార్య మోహన వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు తులసీ దళార్చన

సింహాచలం, ఆగస్టు 14 :వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా సహస్ర తులసీ దళార్చన బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పరిమళభరిత పుష్పమాలికలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్ర నామావళి పఠిస్తూ ప్రతి నామానికి తులసీ దళాలతో పూజ జరిపారు.తరువాత అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో ఆర్జిత నిత్య కల్యాణం జరిపి భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

మైనింగ్ తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దు : సీఐటీయూ

తగరపువలస, ఆగస్టు 14 : ఆనందపురం మండలంలోని కుసులవాడ పంచాయతీ వద్ద మైనింగ్ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వరాదని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు చిట్టివలస గ్రామంలోని సీటూ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందరంగా ఆ సంఘం జోన్ కార్యదర్శి మూర్తి మాట్లాడుతూ కుసులవాడ వద్ద మైనింగ్ తవ్వకాలకు అనుమతి ఇస్తే పంచాయతీ పరిధిలోని ఆరు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. ముఖ్యంగా కాలుష్యం వల్ల అనారోగ్యం బారిన పడతారని తెలిపారు. ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణకు ప్రయత్నిస్తుందని, దీనికి నిరసనగా ఈనెల 16, 17 తేదీల్లో పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పాదయాత్ర చేస్తామన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు ఆర్. నరసింగరావు, ఎస్. అప్పలనాయుడు, ఎం. రాము, పి. సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యువత చేతిలోనే దేశ భవిష్యత్తు : బీజేపీ

పెదవాల్తేరు, ఆగస్టు 14 : యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని బీజేపీ నాయకులు దువ్వూరి సత్యనారాయణమూర్తి, పీవీఎన్ మాధవ్ అన్నారు. బుధవారం రాత్రి నగర బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాతరాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు.

స్వాతంత్ర్య దినోత్సవం ఏర్పాట్లు పరిశీలన

వెంకోజీపాలెం, ఆగస్టు 14 : ఏయూలో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవం ఏర్పాట్లను రిజిస్ట్రార్ కిషోర్‌బాబు బుధవారం పరిశీలించారు. మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించి, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు.

సెల్ టవర్ పనులు నిలిపివేయాలని వినతి

మధురవాడ, ఆగస్టు 14 : పీఎంపాలెం క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న బింద్రానగర్ షిప్‌యార్డు లేఅవుట్‌లో జనావాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ పనులను నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు వారు బుధవారం జోన్-2 కార్యాలయంలో జడ్సీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు తక్షణమే స్పందించి పనులు ఆపించకపోతే ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతామన్నారు.

104 వాహన సేవలు పరిశీలన

ఆనందపురం, ఆగస్టు 14 : మండలంలో 104 వాహన సేవలను జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ అప్పారావు బుధవారం పరిశీలించారు. సిబ్బంది పనితీరు పరిశీలించడంతో పాటు రికార్డులను తనిఖీ చేశారు.

డీపట్టా భూముల విక్రయం అవాస్తవం : తహసీల్దార్

భీమునిపట్నం, ఆగస్టు 14 : ఎర్రమట్టిదిబ్బల ప్రాంతంలో డీపట్టా భూముల అనధికార అమ్మకం అవాస్తవమని తహసీల్దార్ రామారావు తెలిపారు. ఈనెల 13న డీపట్టా భూములు విక్రయం అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పదించారు. జియో హెరిటైజ్ సైట్‌గా నిర్ధారించిన ఎర్రమట్టి దిబ్బల్లో ఏడుగురికి ప్రభుత్వం డీపట్టాలు మంజూరు చేసిందన్నారు. సంబంధిత భూముల్లో ఎటువంటి అనధికారిక అమ్మకాల జరగలేదని చెప్పారు. అలాగే ఆ భూములకు ఫ్రీ హోల్డ్ చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టాలని తీర్మానం

సిరిపురం, ఆగస్టు 14 : జిల్లా శాఖా గ్రంథాలయ సంస్థకు చెందిన స్థలంలో తక్షణమే గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టాలని జిల్లా గ్రంథాలయ సేవా సమితి రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం డాబా గార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంస్థ అధ్యక్షుడు బీఎల్ నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు తీర్మానించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి మా క్లయింట్ శ్రీ పి. పార్వతి D/o. కె.పైడిరాజు గారు ఇచ్చిన భోగట్టాపై తెలియజేయునది ఏమనగా

విశాఖపట్నం జిల్లా, సుజాత నగర్, వాస్తవ్యులు శ్రీ తర్లపు అన్నవరం సత్యనారాయణ గారి భార్య శ్రీమతి తర్లపు ప్రభావతి గారి నుండి డాక్యుమెంటు నెం. 1535/10 తేది. 08-09-2010న విశాఖపట్నం సబ్ రిజిస్ట్రారు ఆఫీసు ద్వారా రిజిస్ట్రీ కాబడిన క్రయ దస్తావేజు మూలంగా దఖలుపడి ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని, మా క్లయింటు క్రయం పొందుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవ్వరికైనా ఎట్టి హక్కులు, అనుభవములు, తనఖాలు, క్లయిములు, మొదలగు అభ్యంతరములు ఉన్నయెడల ఈ ప్రకటన తేది నుండి 14 రోజులలోగా ఈ క్రింది అడ్రస్సు డాక్యుమెంటరీ ఆధారాలతో వ్రాతపూర్వకంగా సంప్రదించగలరు. లేని యెడల ఈ ఆస్తి నిరభ్యంతరమైనదిగా భావించి మా క్లయింటు క్రయచీటి పొందెదరు. తదుపరి వచ్చు ఎటువంటి అభ్యంతరములు సదరు ఆస్తిపై మా క్లయింట్ యొక్క హక్కు అనుభవములను బంధింపజాలవని తెలియజేయడమైనది.

షెడ్యూలు ఆస్తి

గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ ఏరియాలో చేరిన సర్వే నెం. 112 లో చేరిన మహారాణిపేట, వెంకటపతిరాజునగర్‌లో 47.28 చ.గ.లు మరియు 400 చ.అ.ల గల గ్రౌండు ఫ్లోరు, 400 అ.లు ఫస్ట్ ఫ్లోరు మరియు సెకెండు ఫ్లోరులు కలిగిన ఆర్.సి.సి. స్లాబు ఇంటి అందలి డోరు నెం. 14-5-4/1, House Tax Assessment No. 27999/372, కొళాయి నెం. 31540, కరెంటు సర్వీసు నెం.11211-1331-115674ర్లు కలిగిన ఆర్.సి.సి బిల్డింగుకు హద్దులు : **తూర్పు:** 16 అ.లు వెడల్పు గల రోడ్డు, **దక్షిణం:** అబ్దుల్ ఖరీమ్ గారి యిల్లు (సింగంపల్లి అప్పారావు గారి యిల్లు) **పడమర:** సింగంపల్లి అప్పారావు గారి యిల్లు **ఉత్తరం:** పార్శ్వ భైరవ్ టవర్స్

M.V.JAGANNADHA RAO, Advocate
D.No.29-2-34, Opp. District Court
Main Gate, SBI Colony, VSP-20.
Cell: 8074599693.

ఒడిశాకు తిరుగు పయనమైన లక్ష్మీకాంత్ నాయకో దాసుడు



సింహాచలం, ఆగస్టు 14 : ఒడిశాకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయకో దాసుడు సింహగిరి నుంచి ఒడిశాకు తిరుగు పయనమయ్యారు. బుధవారం మధ్యాహ్నం పవళింపు సేవ తరువాత స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపిన తరువాత తన పరివారంతో సంచుల నిండుగా తీసుకువచ్చిన సొమ్మును ఆలయంలోని హుండీల్లో వేశారు. గోదాదేవి అమ్మవారిని దర్శించుకుని కాలి నడకన మెట్ల మార్గంలో కొండదిగువకు చేరుకున్నారు.

ఎండాడ : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ హయగ్రీవ ప్రాజెక్ట్ కొండ కింద జరుగుతున్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ గ్రేడ్ -2 ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.